క్లుప్తంగా

ఆదర్శపాఠశాల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నకరికల్లు: మండలంలోని దేచవరం గ్రామంలో గల ఆదర్శపాఠశాలలో 2023–24కు గాను ఆరోతరగతిలో ప్రవేశానికి ఈనెల 9వతేదీ నుంచి 25వతేదీ వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ వేళాంగిణి మేరీ మంగళవారం తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఏపీఎంఎస్.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జూన్ 11వతేదీన ఉదయం 10 నుంచి 12 గంటల వరకు దేచవరంలోని ఆదర్శపాఠశాలలోనే రాతపరీక్ష నిర్వహిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీలకు పరీక్షఫీజు రూ.75లు, ఓసి, బీసిలకు రూ.150 లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు పాఠశాలలో సంప్రదించవచ్చన్నారు.

పేదలకు దుప్పట్లు, ఆహార ప్యాకెట్లు పంపిణీ



సత్తెనపల్లి: దాతల దాతృత్వంతో పట్టణంలోని గీతా మందిరం వద్ద, మాతృశ్రీ మొల్లమాంబ వృద్ధుల ఆశ్రమంలోను 50 మంది నిరుపేదలకు, వృద్ధులకు, యాచకులకు దుప్పట్లు, భోజన ప్యాకెట్లను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకుడు, న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు, దాతలు పులిపాటి రాజారావు, పులిపాటి సూర్య ప్రకాశరావు, పులిపాటి శ్రీరామమూర్తి, పులిపాటి లక్ష్మీనారాయణ, తదితరులు ఉన్నారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ



అమరావతి: అమరావతి శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు వేసవి శిక్షణా శిబిరం నిర్వహించారు. ఈశిక్షణాశిబిరంలో తొలిరోజు చిత్రలేఖనం, వ్యాసరచన, యోగా, కంప్యూటర్ విద్య, స్పోకెన్ ఇంగ్లిషు, ఆటపాటలు విద్యార్థులకు నేర్పించారు. ఈ సందర్భంగా స్థానిక గ్రంథాలయాధికారి లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించడానికి కథలు చెప్పడం, ఆటలు ఆడిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని వేసవిలో గ్రంథాలయానికి పంపితే వారికి చదువు పట్ల ఆసక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శివాలయానికి ఎకరం భూమి వితరణ



తొండపి(ముప్పాళ్ళ): మండలంలోని తొండపి గ్రామాలయంలో పునర్నిర్మితమైన శివాలయానికి రాజుపాలెం మండలం గణపవరం గ్రామానికి చెందిన వ్యాపారవేత్త నరిశేటి తాండవకృష్ణ, సుభాషిణిల దంపతులు ఎకరం భూమిని వితరణగా అందించారు. తాండవకృష్ణ స్వర్గస్తులైన తన తల్లిదండ్రులు నరిశేటి గురవయ్య, లక్ష్మీనరసమ్మల జ్ఞాపకార్థం శివాలయం నిర్వహణకు గాను భూమి హక్కు పత్రాలను అందించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ ప్రతిష్ఠ లో భాగంగా నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి గాను రూ.10వేలు ఆర్థిక సాయాన్ని శివాలయం కమిటీ సభ్యులైన రాయిడిపూర్ణయ్య, శేషయ్య లకు అందించారు.

ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థినికి ఎమ్మెల్యే అభినందన

అచ్చంపేట: మండలంలోని తాళ్లచెరువుకు చెందిన మాదిరెడ్డి బాలనవ్యత పదవ తరగతి ఇంగ్లిషు మీడియంలో 583 మార్కులు సాధించిన సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మంగళవారం గుంటూరులో అభినందించారు. తెలివైన విద్యార్థులకు బాసటగా నిలచి, ఉన్నత చదువులు చదివించాలని తల్లిదండ్రులు మాదిరెడ్డి బాలశౌరెడ్డి, జ్యోత్స్నలకు సూచించారు. ప్రతిభ ఉన్న విద్యార్థులకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

మారుతీ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ మృతి



సత్తెనపల్లి: పట్టణంలోని వడ్డవల్లి పోలేరమ్మగుడి ఏరియాకు చెందిన మారుతీ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు గొట్టిముక్కల సత్యనారాయణ (67) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. మృతునికి భార్య, ఇరువురు కుమారులు ఉన్నారు. సత్యనారాయణ నేతృత్వంలో మారుతీ కల్చరల్ అసోసియేషన్ ఆరు వసంతాలు పూర్తి చేసుకుంది. సత్తెనపల్లి లో ఉభయ తెలుగు రాష్ట్రాల పాటల పోటీలు సమర్థవతంగా నిర్వహించారు. సత్యనారాయణ మృతి చెందడం బాధకరమని, కుటుంబ సభ్యులుకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

స్మార్ట్‌గా అన్నీ ఆన్‌లైన్‌లోనే

- ఆన్‌లైన్ అనుసంధానంతో అక్రమాలకు చెక్
- 16 నుంచి ఎనిమిదికి తగ్గిన దస్త్రాలు
- అన్నీ వివరాలు స్మార్ట్ ఫోన్‌లోనే నమోదు
- నియోజకవర్గంలో 303 అంగన్‌వాడీ కేంద్రాలు



స్మార్ట్ ఫోన్‌లు అందుకున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సత్తెనపల్లి: ప్రస్తుతం ప్రపంచం ఆధునికత సాంకేతిక వడిలోకి చేరుతోంది. ఎక్కడ ఏ సంఘటన జరిగిన క్షణాల్లో అందరికీ తెలిసిపోతోంది. అలాగే క్షేత్రస్థాయిలో జరిగే లోపాలను సవరించి ప్రజలకు సుపరిపాలన అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కూడా ముందడుగు వేసింది. ఇప్పటికే పారదర్శక పాలన దిశగా మార్పులు చేపట్టింది. ఆయా శాఖలను సాంకేతికత వైపు నడిపిస్తోంది. ఒక్కో ప్రభుత్వ శాఖ ఆధునికీకరణ దిశలో పయనిస్తున్నాయి. ఇంత వరకు దస్త్రాలు కార్యాలయాలకే పరిమితమయ్యేవి. నమోదు చేసుకోవడం, భద్రపరచడం, ఉన్నతాధికారులు వచ్చినప్పుడు వాటిని పరిశీలించడం వరకే పరిమితమయ్యేది. ప్రస్తుతం ఆన్‌లైన్ సేవలు వచ్చేశాయి. దీంతో కార్యాలయంలో ఏమి జరిగిందో అంతా క్షణాల్లో ఆన్‌లైన్‌లోకి వెళ్లిపోతుంది. తప్పు చేస్తే సాంకేతికత పట్టేస్తుంది. కొన్ని నెలలుగా అంగన్‌వాడీ కేంద్రాలు కూడా ఆన్‌లైన్ సేవల్లోకి వచ్చేశాయి. అందుకుగాను అంగన్‌వాడీ కార్యకర్తలకు, పర్యవేక్షకులకు ఐసీడీఎస్ అధికారులు శిక్షణ ఇచ్చారు.

ఎనిమిదికి తగ్గిన దస్త్రాలు .....

అంగన్‌వాడీ కార్యకర్తలకు, పర్యవేక్షకులకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ద్వారా స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేశారు. వీటి వినియోగంపై కార్యకర్తలకు, పర్యవేక్షకులకు శిక్షణ ఇచ్చారు. వీటిలోనే కేంద్రానికి సంబంధించిన సమస్త సమాచారం పొందుపరచాలి. ఇప్పటివరకు 16 రకాల దస్త్రాలు నిర్వహిస్తున్నారు. అవన్నీ చేతితో రాసినవే. ఇక నుంచి రాయాల్సిన పనిలేదు. దస్త్రాలు కూడా 8 రకాలకు కుదించారు. అన్నీ వివరాలు స్మార్ట్‌ఫోన్‌లోనే నమోదు చేయాలి. ఈ వివరాలు ఆ శాఖ ఉన్నతాధికారులు చూసేలా అనుసంధానం చేశారు. ఎప్పటికప్పుడు సమాచారం ఆన్‌లైన్‌లో లభ్యమవుతుంది. ఇది అందరికీ అందుబాటులో ఉంటుంది.

ఇవీ లాభాలు .....

అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు బాలామృతం, పాలు, భోజనం, గుడ్లు, ఇతర పౌష్టికాహారం అందిస్తున్నారు. ఈ ఆహారం ఎంతమందికి అందుతుందో గతంలో తెలియని పరిస్థితి. కొన్ని సందర్భాల్లో వచ్చిన ఆహార పదార్థాలు లబ్ధిదారులకు చేరకుండానే స్వాహా అవుతున్నాయనే ఆరోపణలు గతంలో ఎక్కువగా ఉన్నాయి. వారు వచ్చి తీసుకుని వేలిముద్ర వేస్తేనే ఇచ్చేలా ప్రస్తుతం ఏర్పాట్లు చేశారు. బయోమెట్రిక్ దీన్ని అనుసంధానం చేశారు. అలాగే విద్యార్థులు ఎంతమంది హాజరయ్యారు? ఎంత మంది పౌష్టికాహారం తిన్నారనే ఫోటో తీయాలి. వాటిని ఆ శాఖ వెబ్‌సైట్‌లోతో ఉంచాలి. దీనివల్ల అవినీతికి ఆస్కారం చాలా వరకు తగ్గింది. సరుకులు పక్కదారి పట్టే అవకాశం తగ్గింది. పిల్లాడికి దక్కాల్సింది దక్కుతుందని తల్లిదండ్రులు అంటున్నారు. ఇలా అనేక లాభాలు ఉన్నాయి.

నియోజకవర్గంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు...

మండలం	అంగన్‌వాడీ కేంద్రాలు	గర్భిణులు	బాలింతలు	0–6లోపు చిన్నారులు
సత్తెనపల్లిటౌన్	43	263	283	4,935
సత్తెనపల్లిరూరల్	76	315	380	5,728
ముప్పాళ్ళ	45	209	226	2,129
రాజుపాలెం	65	321	345	3,123
నకరికల్లు	74	427	468	4,420
మొత్తం	303	1,535	1,702	20,335

పనితీరు మెరుగుకు దోహదం



అంగన్‌వాడీ కార్యకర్తలకు, పర్యవేక్షకులకు పని తీరు మెరుగు పడటానికి స్మార్ట్ ఫోన్లు దోహదపడుతున్నాయి. ఈ ఫోన్‌ల వల్ల కేంద్రాల పనితీరు ఎప్పటికప్పుడు అంచనా వేయగలుగుతున్నాం. ఇప్పటికే అంగన్వాడీ కార్యకర్తలకు, పర్యవేక్షకులకు స్మార్ట్‌ఫోన్ల వాడకంపై పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వడం కూడా జరిగింది. అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు వీటిని బాగానే వాడుతున్నారు.

–ఆర్.అరుణ,
ఐసీడీఎస్ గ్రేడ్ –1 సూపర్‌వైజర్, సత్తెనపల్లి

సేవల్లో లోపాల సవరణకు 'జగనన్నకు చెబుదాం'



జగనన్నకు చెబుదాం ప్రారంభోత్సవాన్ని వీక్షిస్తున్న ఎంపీపీ జైబూన్‌బీ, ఎంపీడీఓ, తహసీల్దార్, సీఐ



సీఎం వీడియోకాన్ఫరెన్స్‌కు హాజరైన తహసీల్దార్, మండలస్థాయి అధికారులు

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, సేవల్లో లోపాలు సవరించి అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడంతో పాటు సేవలు మరింత చేరువ చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని సత్తెనపల్లి మండల పరిషత్ అధ్యక్షురాలు షేక్ ఎలవర్తిపాటి జైబూన్‌బీ అన్నారు. ఎన్నో విశిష్ట పథకాలతో దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా పేరు తెచ్చుకున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రస్తుతం మరో విశిష్ట కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలకు సంబంధించి వ్యక్తిగత స్థాయిలో ప్రజలకు ఎదురయ్యే సమస్యలకు మరింత మెరుగైన, నాణ్యమైన పరిష్కారం చూపాలన్న తపనతో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభించారన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని అన్ని మండల పరిషత్ కార్యాలయాలతో పాటు గ్రామ, వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల్లో జగనన్నకు చెబుదాం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశామన్నారు. సత్తెనపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ షేక్ ఎలవర్తిపాటి జైబూన్ బీ, జెడ్పీటీసీ సంకటి నాగమల్లేశ్వరి, తహసీల్దార్ కె. నగేష్ గారు, ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ, సత్తెనపల్లి రూరల్ సీఐ చిట్టెం కోటేశ్వరరావులు పాల్గొన్నారు. ఎంపీపీ జైబూన్ బీ ప్రభుత్వ సేవలకు సంబంధించి ఏ సమస్య పరిష్కారానికైనా 1902 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి ఫిర్యాదు ఇవ్వవచ్చునన్నారు. జెడ్పీటీసీ సంకటి నాగమల్లేశ్వరి మాట్లాడుతూ ఎస్ఎంఎస్ ద్వారా పౌరులు ఎప్పటికప్పుడు తమ ఫిర్యాదుల స్థితిని, వాటి పరిష్కారం గురించి తెలుసుకునే సౌకర్యం ఉందన్నారు. తహసీల్దార్ కె.నగేష్ మాట్లాడుతూ అనేక సమస్యలకు అత్యున్నత స్థాయిలో పరిష్కార ప్రక్రియను ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్లతో పాటు ప్రత్యక్షంగా ముఖ్యమంత్రి కార్యాలయం పర్య వేక్షిస్తోందన్నారు. ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ఫిర్యాదును నమోదు చేసుకోగానే వైఎస్ఆర్(యువర్ సర్వీస్ రిక్వెస్ట్) ఐడిని కేటాయిస్తారని, మండల స్థాయిలో కూడా ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేశామన్నారు. సత్తెనపల్లి రూరల్ సీఐ చిట్టెం కోటేశ్వరరావు మాట్లాడుతూ సమస్య పరిష్కారం తరువాత ప్రభుత్వ సేవలపై ప్రజల అభిప్రాయాన్ని పంచుకోవచ్చునన్నారు. జగనన్నకు చెబుదాం సేవలను ప్రజలందరూ పూర్తిస్థాయిలో వినియోగించుకుని సమస్యలకు తక్షణ పరిష్కారం పొందాలని కోరారు. సత్తెనపల్లి మండల స్థాయిలో అన్ని గ్రామాల్లో కూడా ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఆయా కార్యక్రమాలల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ముప్పాళ్ళ: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ సేవలకు సంబంధించి సమస్యల పరిష్కారానికై మంగళవారం ప్రారంభించిన జగనన్నకు చెబుదాం వీడియోకాన్ఫరెన్స్ లో మండలస్థాయి అధికారులు హాజరయ్యారు. ఏదైనా సమస్య ఉంటే 1902 టోల్‌ఫ్రీ నంబర్‌కు డయల్‌తో పాటుగా, ముఖ్యమంత్రి సందేశాన్ని తిలకించారు. తహసీల్దార్ ఎమ్.భవానిశంకర్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

మొక్కపాడులో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు

రాజుపాలెం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు విధానం గ్రామీణ ప్రజలు వినియోగించుకోవాలని డాక్టర్ నవ్య తెలిపారు. మండలంలోని మొక్కపాడులో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు మంగళవారం నిర్వహించారు. డాక్టర్ నవ్య 53 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. గర్భిణులు ఐదుగురు, ముగ్గురు బాలింతలకు, ఎనిమిది మంది పిల్లలకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. 20 మందికి బీపీ, 15 మందికి షుగర్ పరీక్షలు చేసి 15 రోజులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మంచానికే పరిమితమై ఇంటి వద్ద ఉన్న వారి ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు చేసి మందులను అందించారు. ఈ గ్రామానికి నెలకు రెండు సార్లు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్‌లు జీవన్‌రావు, శివమాధవి, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

14 నుంచి తిరునాళ్ల



బెల్లంకొండ: మండలంలోని బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద గల శ్రీకోళ్లూరు ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల వేడుకలు ఈ నెల 14 నుండీ 16 తేదీ వరకూ జరగనున్నాయి. ఈ నేపథ్యంలో తిరునాళ్ల వేడుకలను ఘనంగా నిర్వహించాలని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు. మంగళవారం దేవస్థాన ట్రస్ట్ బోర్డు చైర్మన్, దేవాదాయ శాఖ అధికారులతో ఉత్సవాల నిర్వహణపై సమావేశాన్ని నిర్వహించారు. స్వామివారి కల్యాణ ఉత్సవాల సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆలయం వద్ద బారికేడు, టెంట్లు ఏర్పాటు, తాగు నీటి సదుపాయాలపై చర్చించారు. మూడు రోజుపాటు రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న కబడ్డీ పోటీల్లో క్రీడాకారులకు వసతి ఏర్పాట్లు, మిగిలిన ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల గురించి మాట్లాడారు. అనంతరం వేడుకలకు సంబంధించిన ఆహ్వాన పత్రాలను ఎమ్మెల్యే శంకరరావు దంపతులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి, దేవస్థాన ట్రస్ట్ బోర్డు చైర్మన్ మర్రి ప్రసాదరెడ్డి, ఈవో గాదె రామకోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సిలో గర్భిణులకు వైద్యపరీక్షలు



స్థానిక పీహెచ్‌సిలో గర్భిణులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీనునాయక్, డాక్టర్ నాగమణి

నకరికల్లు: ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ పథకం గర్భిణులకు వరంలాంటిదని డాక్టర్ వి.శ్రీనునాయక్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి రక్తహీనత గలవారికి ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్‌లు, ఐరన్‌మాత్రలు ఉచితంగా మందులు అందజేశామన్నారు. మూత్రపరీక్షలు, ఎత్తు, బరువు పరీక్షలు చేశామన్నారు. రక్తహీనత వల్ల సంభవించే అధికరక్తపోటు, గుర్రపువాతం, షుగరు సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. డాక్టర్ బి.నాగమణి, హెల్త్ సూపర్‌వైజర్ కె.మల్లయ్య, సూపర్‌వైజర్‌లు, స్టాఫ్‌నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో మహిళకు రిమాండ్

సత్తెనపల్లి: చోరీ కేసులో మహిళకు న్యాయమూర్తి మంగళవారం రిమాండ్ విధించారు. పట్టణంలోని తాలూకా సెంటర్‌లో నరసరావుపేటకు చెందిన కొర్రప్రోలు సీతారావమ్మ ఇస్సపాలెం వెళ్లేందుకు 2023 మార్చి 2న ఆటో ఎక్కింది. ఆమె దగ్గర ఉన్న బ్యాగులో రూ. 4 లక్షలు విలువ చేసే 10 శవర్ల బంగారు ఆభరణాలు ఉన్నాయి. ఆటోలో ఉన్న చీరాలకు చెందిన సాధుపాటి సునీత ఆభరణాల బ్యాగ్‌ను గమనించి చాకచక్యంగా కత్తిరించి 10 సవర్ల బంగారు ఆభరణాలను అపహరించి మార్గ మధ్యలో ఆటో దిగింది. ఇస్సపాలెంలో ఆటో దిగిన సీతారామమ్మ తన బ్యాగు కట్ చేసి బంగారు ఆభరణాలు అపహరించడాన్ని చూసి లబోదిబో మంటూ సత్తెనపల్లి పట్టణానికి చేరుకుని పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పట్టణ సీఐ యు.శోభన్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సత్తెనపల్లి డీఎస్పీ బి ఆదినారాయణ నేతృత్వంలో సీఐ శోభన్ బాబు ఆధ్వర్యంలో సిబ్బంది సాధుపాటి సునీత బంగారు ఆభరణాలను దొంగిలించినట్లుగా గుర్తించి ఆమె నుంచి పది శవర్ల బంగారు ఆభరణాలను రికవరీ చేసి కోర్టుకు హాజరు పరిచారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న డాక్టర్ రవివర్మ

పెదకూరపాడు: వేసవికాలంలో వైద్యుల సూచనలు, సలహాలు తప్పకుండా పాటించాలని సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ రవివర్మ అన్నారు. మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్షల నిమిత్తం వైద్యశాలకు వచ్చిన గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. ఈసందర్భంగా డాక్టర్ రవివర్మ మాట్లాడుతూ బలవర్ధక ఆహారం తీసుకోవడంతోపాటు, ఆరోగ్య సూత్రాలు పాటిస్తే తల్లి, బిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. మాగులూరి ఫౌండేషన్ వారు ప్రతినెలా పరీక్షలకు వచ్చే గర్భిణులకు పౌష్టికాహారం అందించడం అభినందనీయమని తెలిపారు. ఫౌండేషన్ నిర్వాహకులు కుంచనపల్లి కిరణ్‌కుమార్, మాగులూరి కృష్ణారావు, కొండవీటి ప్రసాద్ పాల్గొన్నారు.

సీతారావమ్మకి మంత్రి నివాళి



సీతారావమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: మండల పరిధిలోని రెంటపాళ్ల గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు, పాకాలపాడు పీఏసీఎస్ అధ్యక్షుడు కొర్లకుంట వెంకటేశ్వర్లు తల్లి సీతామహాలక్ష్మి ఇటీవల మృతి చెందింది. మంగళవారం ఆమె పెద్దకర్మ కార్యక్రమానికి రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హాజరయ్యారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మంత్రితో పాటు వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి రూరల్ మండల కన్వీనర్ రాయపాటి పురుషోత్తమరావు, రైతు సలహా మండలి రాష్ట్ర సభ్యుడు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, ఎస్సీ సెల్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు చిలుకా జయపాల్, ధూళిపాళ్ల సొసైటీ చైర్మన్ నలబోతు శివన్నారాయణ, అబ్బూరి వీరాంజనేయులు, కొర్లకుంట నాగమల్లేశ్వరరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

రైతులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



రైతులనుద్దేశించి మాట్లాడుతున్న ఏఓ సుగుణాబేగం



నార్నెపాడులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ అరుణ

ఏఓ సుగుణాబేగం

అచ్చంపేట: ప్రభుత్వం రైతులకు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని, రైతు భరోసా కేంద్రాలద్వారా ఇచ్చే సూచనలను పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యపడతాయని ఏఓ షేక్ సుగుణాబేగం తెలిపారు. ఖరీఫ్ సాగుపై తాడువాయి, చింతపల్లి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన రైతు అవగాహన సదుస్సులో ఆమె మాట్లాడారు. ముఖ్యంగా రైతులు ఖరీఫ్ సాగుకు ముందుగా వేసవి దుక్కులు దున్నుకోవాలన్నారు. భూసార పరీక్షలు చేయించుకుని అనువైన పంటలను ఎంపిక చేసుకోవాలని చెప్పారు. విత్తన కొనుగోలులో నాణ్యతను పాటించాలని, విత్తన శుద్ధి, మొలకశాతం పరిశీలించుకోవాలన్నారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడవలసి ఉంటుందన్నారు. రైతు భరోసా, పీయం కిసాన్ యోజన, యంత్రసేవా పథకం, డ్రోన్ వినియోగం గురించి వివరించారు. కౌలు రైతులు పంట సాగు హక్కు పత్రాలను పొంది బ్యాంకుల ద్వారా వడ్డీలేని రుణాలు పొందాలని సూచించారు. రైతు భరోసా కేంద్రాలలో ఇచ్చే పచ్చిరొట్టె విత్తనాలపై అవగాహన కల్పించారు. పశువైద్యాధికారి డాక్టర్ స్వాతీదేవి పశువులలో తరచుగా వచ్చే వ్యాధులు, వాటి నిర్మూలను గురించి వివరించారు. కార్యక్రమంలో రైతు భరోసాకేంద్ర సిబ్బంది, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి

నార్నెపాడు(ముప్పాళ్ళ): రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎమ్.అరుణ చెప్పారు. మండలంలోని నార్నెపాడు ఆర్బీకేలో ఖరీఫ్ సన్నదత సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశంలో ఏఓ అరుణ మాట్లాడుతూ పొలాలను ఖాళీగా వదలకుండా పచ్చరొట్ట పైర్లను సాగు చేసుకోవాలన్నారు. మినుము, కొర్రలు లాంటి స్వల్ప కాలిక పంటలు వేసుకున్నట్లయితే పొలం బీడు బారకుండా భూసారం పెరుగుతుందన్నారు. ఖరీఫ్ సాగు కు ముందర భూసార పరీక్షలు చేసుకొని వాటి ఫలితాలు ఆదారంగా ఎరువుల వాడకం చేపట్టినట్లయి సాగు వ్యయం తగ్గించుకునే అవకాశం ఉంటుందన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు రైతుభరోసా కేంద్రాల ద్వారా అందుతాయన్నారు. త్వరలో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. అర్హులైన కౌలు రైతులకు కౌలురుణఅర్హతా కార్డులు అందించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వీఏఏ ప్రియాంక, సచివాలయసిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న మండల వ్యవసాయాధికారి దేవదాసు

ఖరీఫ్ సాగుపై రైతులకు సూచనలు

నకరికల్లు: రైతుభరోసా కేంద్రాల్లో 50 శాతం రాయితీపై పంపిణీ చేస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. మండలంలోని నర్సింగపాడులోని రైతు భరోసాకేంద్రంలో ఖరీఫ్ సీజన్‌కు గాను సాగుకు సమాయత్తం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 10వతేదీ నుంచి 50 శాతం రాయితీపై పిల్లిపెసర రూ.48.50లకు, జీలుగ రూ.39.50లకు, జనుము రూ.48.50లకు రైతులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మార్కెట్ ధరపై సగం ధరకే పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేసవిసీజన్‌లో భూములకు లోతుదుక్కులు దున్నుకోవడం ద్వారా పంటలకు చీడపీడలు ఆశించకుండా నివారించవచ్చన్నారు.

రేషన్‌దుకాణాలపై విజిలెన్స్ దాడులు



బియ్యం నిల్వలు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

అమరావతి: మండల కేంద్రమైన అమరావతిలో రేషన్ దుకాణాలపై మంగళవారం విజిలెన్స్ సీఐ శ్రీహరిరావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో రేషన్ షాప్‌నంబరు 43లో సుమారు 120 బస్తాలు అనగా 6113 కేజీల బియ్యం నిల్వలు మాయమైనట్లు గుర్తించారు. అలాగే షాప్‌నం.2లో 117కేజీల బియ్యం నిల్వలేనట్లుగా గుర్తించారు. ఈసందర్భంగా విజిలెన్స్ సీఐ శ్రీహరిరావు మాట్లాడుతూ షాప్‌నం.43లో రేషన్‌డీలర్ మాధవి, ఎండిఎం ఆపరేటర్ ఆదాం పైన అలాగే షాప్‌నం.2లో గుడిసె ముక్కంటిపైన పేదలకు పంచాల్సిన బియ్యాన్ని మాయం చేసినందుకు క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నామని అలాగే నిత్యావసరాల చట్టం కింది కేసు నమోదు చేయాలని జాయింట్ కలెక్టర్‌కు సిఫార్సు చేస్తున్నామని తెలిపారు. ఈదాడుల్లో ఇన్‌చార్జీ ఆర్ఐ రాజశేఖర్, వీఆర్ఓ మురళి తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ తనిఖీల్లో రేషన్ షాపు సీజ్

నాగవరం(క్రోసూరు): మండలంలోని నాగవరం గ్రామంలో సివిల్‌సప్లమ్ విజిలెన్స్ అధికారులు సోమవారం రేషన్‌షాపులు తనిఖీ నిర్వహించారు. అందులోభాగంగా ఆవుల వెంకటేశ్వర్లు(సాయి) నిర్వహిస్తున్న రేషన్‌షాపు సీజ్ చేసారు. షాపులో పీడీఎస్ బియ్యం 2595 కిలోలు ఉండాల్సి ఉండగా తనిఖీ సమయంలో కేవలం 300 కిలోలు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. షాపుసీజ్ చేసి గ్రామ వీఆర్వో భానుచందర్ కు బాధ్యతలు అప్పగించడం జరిగింది. ఈదాడుల్లో విజిలెన్స్ సీఐ లక్ష్మారెడ్డి, ఏఎస్ఓ రోషన్, సిబ్బంది, మండల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు వినతి పత్రం అందజేస్తున్న సీహెచ్‌ఓలు

పెదకూరపాడు: వైద్య ఆరోగ్య శాఖ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో సీహెచ్‌ఓలుగా పనిచేస్తున్న సిబ్బంది బుధవారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావును కలిసి సమస్యల పరిష్కరించాలంటూ అర్జీ ఇచ్చారు. నేషనల్ హెల్త్ మిషన్ కింద పనిచేస్తున్న సిబ్బందికి రూ. 25 వేలు వేతనంతోపాటు, రూ. 15 వేలు ఇన్‌సెంటీవ్ వస్తోందని, ఇన్‌సెంటీవ్ చెల్లించడం లేదని, వెంటనే చెల్లించేలా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కాంట్రాక్టు పద్ధతిన పని చేస్తున్న వీరిని క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. సమస్య విన్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పరిష్కరిస్తామని తెలిపారు.